నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 25 జనవరి 2025 RANGAREDDY



జాబ్ మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## జాబ్ మేళాకు విశేష స్పందన

బడంగ్‌పేట, జనవరి 24 : పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నగరం నలుమూలలా అనేక కంపెనీలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని మన్‌సాన్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. అంతకుముందు జాబ్‌మేళాను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కేసీఆర్ అనేక కంపెనీలను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ట్ అండ్ కాలిగ్రఫీ..

సిటీబ్యూరో: భారత రాజ్యాంగ 75వ వసంతోత్సవాన్ని పురస్కరించుకుని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో ఆర్ట్ అండ్ కాలిగ్రఫీ ఎగ్జిబిషన్ కొలువుదీరింది. దీనిని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. గవర్నర్‌కు హైదరాబాద్ రీజియనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ ఎగ్జిబిషన్ విషయాలను వివరించారు. ఈ ఏడాది ముగింపు వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని స్నేహజ తెలిపారు.



### మృతదేహాన్ని ఉడికించేందుకు
## పొటాషియం హైడ్రాక్సైడ్ వినియోగం

- బాత్‌రూం అడ్డగానే మృతదేహం ముక్కలు
- స్టౌవ్‌పై కాల్చి.. రోకలితో బొక్కలను పొడిగా
- నిందితుడు చెప్పిన విషయాలకు సాంకేతిక ఆధారాలతో విశ్లేషణ
- మాధవి మిస్సింగ్ కేసును హత్యగా మార్పు

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీర్‌పేట్‌లోని దారుణ ఘటనలో భార్యను ముక్కలుగా చేసి ఉడికించేందుకు పొటాషియం హైడ్రాక్సైడ్‌ను వాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాత్‌రూంలో కూర్చొని శరీరాన్ని ముక్కలుగా నరికేశాడని ఒక అంచనాకు వచ్చారు. ఈ నెల 18న మీర్‌పేట్ ఠాణా పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో నివాసముండే పుట్ట వెంకట మాధవి మిస్సింగ్‌పై కేసు నమోదు అయ్యింది. ఈ కేసు దర్యాప్తులో ఆమె భర్తే అతి కిరాతకంగా ఆమెను చంపి, శరీరాన్ని ముక్కలుగా చేసి వేడి నీటిలో ఉడికించి, బొక్కలు పొడి చేసి బాత్‌రూమ్ ఫ్లష్ ద్వారా డ్రైనేజీలోకి పంపించాడని వెల్లడైంది. ఈ ఘటనపై నిందితుడు గురుమూర్తి పోలీసులకు రోజుకో మాట చెబుతూ ఆధారాలు చిక్కకుండా ప్లాన్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో సాంకేతిక ఆధారాలను సేకరించేందుకు హైదరాబాద్ క్లూస్ టీమ్ హెడ్, సైంటిస్ట్ వెంకన్న బృందం సహకారం అందిస్తున్నది. బ్లూరే టెక్నాలజీతో గురుమూర్తి ఇంట్లో నుంచి సేకరించిన ఆధారాలను మీర్‌పేట పోలీసులు విశ్లేషించారు. సాంకేతికపరమైన ఆధారాలు, 14వ తేదీ రాత్రి నుంచి 16వ తేదీ రాత్రి వరకు నిందితుడు గురుమూర్తి సెల్‌ఫోన్ సిగ్నల్స్, కాల్స్‌తో పాటు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను సేకరించారు. సాంకేతికపరంగా సేకరించిన అంశాలు, నిందితుడు గురుమూర్తి చెప్పిన అంశాలను విశ్లేషించి.. మాధవిని గురుమూర్తి హత్య చేసి, ఆమె మృతదేహాన్ని దొరక్కకుండా ప్లాన్ చేసినట్లు ఒక నిర్ధారణకు వచ్చారు. దీంతో ఇప్పటివరకు మిస్సింగ్‌గా ఉన్న ఈ కేసును హత్య కేసుగా మార్చనున్నారు. హత్య కేసుగా మార్చిన తర్వాత మరోసారి గురుమూర్తి ఇంట్లో సీన్ రికన్‌స్ట్రక్షన్ చేసి హత్య కేసులో పకడ్బందీ ఆధారాలను సేకరించి అతడిని అరెస్టు చేసే అవకాశాలున్నాయి.




### బాత్‌రూమ్‌నే అడ్డగా చేశాడు..

గురుమూర్తి తన భార్యతో గొడవ పడి ఆమెను హత్య చేశాడు. హత్య తర్వాత ఆమె మృతదేహం కనిపించకుండా చేస్తే తనను ఎవరూ పట్టుకోరనే భావనలో ఉన్నాడు. దీంతో తన ఇంట్లో ఉన్న కత్తులతోనే మృతదేహాన్ని ముక్కలుగా చేశాడు. మొదట చేతులు, ఆ తర్వాత రెండు కాళ్లు నరికి వాటిని రెండు భాగాలుగా చేసి బకెట్లో వేశాడు. హీటర్‌ను ఆన్ చేసి ఆ వేడి నీటిలో వాటిని ఉడికించాడు. మాంసం, బొక్కలు వేరు అయ్యేందుకు త్వరగా ఉడికేలా పొటాషియం హైడ్రాక్సైడ్‌ను వాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాత్‌రూమ్‌లోనే శరీరాన్ని ముక్కలుగా చేశాడు. బాత్ రూం బయట పెయింట్ కోసం ఉపయోగించే 25 లీటర్ల డబ్బాలో హీటర్ వేసి అందులో నీటని వేడి చేసినట్లు ఆధారాలు సేకరించారు. ముక్కలు మొత్తం మెత్తగా చేసి వాటిని టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేశాడు. అనంతరం బొక్కలను ఫంక్షన్ హాల్‌లో వంటలు చేసేందుకు ఉపయోగించే పెద్ద స్టౌవ్‌పై కాల్చాడు. కాల్చిన బొక్కలను రోకలిపై వేసి దంచి, ఆ తరువాత వాటిని పొడి చేసి టాయిలెట్ ద్వారా డ్రైనేజీలోకి పంపించినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ కేసుపై ఇప్పటికే పోలీసులు పలు రకాలైన ఆధారాలను సేకరించి, హత్య జరిగిన విధానంపై విశ్లేషణ చేసి ఒక నిర్ధారణకు వచ్చా రు. కేసులోని సెక్షన్లను మార్చి ఒకటి రెండు రోజుల్లో నిందితుడిని కోర్టులో హాజరుపరిచే అవకాశాలున్నాయి. కాగా ఈ ఘటనపై దేశంలోని ప్రధానమైన ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నుంచి సహకారాన్ని తీసుకుంటున్నామని, ఇంకా దర్యాప్తు దశలోనే ఉందని, ఈ సమయంలో అధికారంగా ఏ విషయం చెప్పలేమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

## నేడు గ్రేటర్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల మీటింగ్

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా బీఆర్ఎస్ పోరు ను ఉధృతం చేసేందుకు సిద్ధమైంది. ఏడాదిగా గ్రేటర్‌లో అభివృద్ధి కుంటుపడడం, రోజురోజుకూ ప్రజా సమస్యలు పెరిగిపోతుండడంతో ప్రజలతో కలిసి సర్కారుపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిరసన గళం వైపు అడుగులు వేశారు. ఇందులో భాగంగానే గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గాల వారీగా వినతిపత్రాలను సమర్పించారు. ఈ క్రమంలోనే పోరుబాటను ఉధృతం చేసేందుకు శనివారం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో గ్రేటర్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ లో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్లు దాదాపు 67 మంది ఈ సమావేశంలో పాల్గొననున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై వారికి దిశానిర్దేశం చేయనున్నారు.




### రెగ్యులర్ పోస్టుల్లో భర్తీ చేయాలని..

తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ సర్కిల్ కార్యాలయం ఎదుట జిల్లా జేఏసీ నాయకులు రిలే దీక్ష చేపట్టారు. గత 25 నుంచి 30 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులను వారి విద్యార్హతలకు తగిన విధంగా రెగ్యులర్ పోస్టుల్లో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో వికారాబాద్ జిల్లా జేఏసీ నాయకులు బుచ్చిరెడ్డి, రామాంజనేయులు, అక్తర్ అలీ, సాయిలు, పరమేశ్, సురేశ్, బాలరాజ్, ఆంజనేయులు, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

-వికారాబాద్, జనవరి 24

### మళ్లీ, మళ్లీ దరఖాస్తు చేయాలా..?



ఇప్పటికే ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో రాలేదు. అందుకు గల కారణాలను అధికారులు చెప్పలేదు. తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. ప్రజలను దర ఖాస్తుల పేరుతో ఇబ్బంది పెట్టడం తగదు. ఆఫీసర్లు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి.

-వెంకటేశ్ యాదవ్,
సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు, కోట్‌పల్లి

- గ్రామ, వార్డు సభల్లో అధికారులకు ప్రశ్నల వర్షం
- మొదటి రోజు నుంచీ వికారాబాద్ జిల్లాలోని ప్రజల్లో తీవ్ర నిరసన
- అధికారులతో వాగ్వాదాలు.. అడ్డగింతలు
- అనర్హులకు జాబితాల్లో చోటు దక్కడంతో ఆగ్రహం
- ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మళ్లీ దరఖాస్తుల స్వీకరణకు నిర్ణయం

# నిరసన హోరు.. ముగిసిన సభలు

- జిల్లావ్యాప్తంగా కొత్తగా వచ్చిన దరఖాస్తులు 96,423
- అత్యధికంగా కొత్త రేషన్ కార్డుల కోసం 58,784 దరఖాస్తులు
- ఇందిరమ్మ ఇండ్లకు 26,312, రైతు భరోసాకు 3745, ఆత్మీయ భరోసాకు 7582 అప్లికేషన్లు
- పోలీస్ పహారా మధ్య ముగిసిన సభలు

వికారాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనుకున్న గ్రామ, వార్డు సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు లబ్ధిదారుల జాబితాలను ఎంపిక చేసేందుకు నిర్వహించిన గ్రామ, వార్డు సభలు నిరసనలు, నిలదీతల నడుమ ముగిశాయి. గ్రామ సభలకు హాజరైన అధికారులకు ప్రజల నుంచి ప్రశ్నల వర్షం కురిసిం ది. ఈనెల 21 నుంచి శుక్రవారం వరకు ఈ సభలు జరుగగా.. అర్హులైన పేదలను కాదని అనర్హులకే జాబితాల్లో అందలం వేయడం, అర్హులను ఏకపక్షంగా తగ్గించడం వంటి కారణాలతో పల్లెల్లోని గ్రామసభలు ఉద్రిక్తంగా, రణరంగంగా మారాయి. చివరికి పోలీసుల బందోబస్తు మధ్య సభలు నిర్వహించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

-బంట్వారం(కోట్‌పల్లి)మండలంలోని బార్వాద్ గ్రామంలో ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల విషయమే అధికారులతో వాగ్వావాదానికి దిగారు. గతేడాది నిర్వహించిన ప్రజాపాలన సభల్లోనే 7,314 మంది దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు జాబితాలో 4,337 పేర్లను అధికారులు ప్రకటించడంతో మండిపడ్డారు. అర్హులందరికీ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

-వికారాబాద్ మండలంలోని జైదుపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో అనసూయ అనే మహిళ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. మరణించిన వారి పేర్లపై సంక్షేమ పథకాలు ఎలా వస్తాయని గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శులను నిలదీశారు.


-తాండూరు మండలంలోని అంతారం గ్రామంలో జరిగిన గ్రామసభలో బీఆర్ఎస్ మద్దతుదారులకు సంక్షేమ పథకాల జాబితాలో ఎందుకు పేర్లు రావడంలేదని బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించారు.

-సమావేశాలు పెట్టి దరఖాస్తులు తీసుకోవడం తప్ప సంక్షేమ పథకాలను అందించడంలేదని పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ప్రజలు అధికారులను నిలదీశారు.

-మంచాల మండలంలోని జాపాల గ్రామంలో జరిగిన గ్రామసభ రసాభాసగా సాగింది. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అర్హుల జాబితాను పక్కనపెట్టి కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల పేర్లను జాబితాలో చేర్చి చదవడం ఏమిటని ప్రజలు ప్రశ్నించారు.

-తాండూరు పాత మున్సిపల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వార్డు సభలో గందరగోళం నెలకొన్నది. ఆ సభకు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు ఎవరూ రాకపోవడంతో స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డులకు ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి బీఆర్ఎస్ కౌన్సిలర్ వార్డు సభకు ఎందుకు రారని ప్రశ్నించారు. దీంతో ప్రజలు, కౌన్సిలర్ ఆసిఫ్ బసవన్నకట్ట దగ్గర నిర్వహించిన సభకు ఎమ్మెల్యే హాజరు కావడంతో అక్కడికెళ్లి తమ సమస్యలను చెబుతామనుకోగానే పోలీసులు చుట్టుముట్టి వెళ్లనివ్వలేదు.

మంచాల : జాపాల గ్రామ సభలో అధికారుల తీరును నిరసిస్తూ గ్రామసభ నుంచి వెళ్లిపోతున్న ప్రజలు




### నిరసనలు.. నిలదీతల మధ్య..

రంగారెడ్డి, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో నాలుగు రోజుల పాటు కొనసాగిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు శుక్రవారం ముగిశా యి. గత నాలుగు రోజులుగా జిల్లాలోని పల్లెల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఉత్కంఠభరితంగా సాగాయి. ఎక్కడ చూసినా నిరసనలు, నిలదీతల మధ్య సభలు హోరెత్తాయి. కొన్ని మండలాల్లో పోలీసుల నిఘాలో కొనసాగాయి. అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించగా.. తమ పేర్లు రాని ప్రజలు అధికారులను ఎక్కడికక్కడ అడ్డుకుని, నిలదీశారు. అధికారుల సూచనల మేరకు మళ్లీ పథకా లకు దరఖాస్తులు చేసుకున్నారు. కాగా జిల్లాలో మొత్తం 924 గ్రామ, వార్డు సభలను నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 48,358 మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్ కార్డుల కోసం 1,53,000 మంది ప్రజా పాలన, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోగా, గ్రామ సభల ద్వారా 73,039 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.



తాండూరు : వార్డు సభలో కౌన్సిలర్ ఆసిఫ్‌ను నిర్బంధించిన పోలీసులు

వికారాబాద్ : జైదుపల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న మహిళ



### కొత్తగా వచ్చిన దరఖాస్తులు 96,423..

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాల్లో సగానికిపైగా అర్హులకు అన్యాయం జరుగడంతో పలువురు అధికారులను నిలదీశారు. గత నాలుగు రోజులుగా జరిగిన గ్రామ, వార్డు సభల్లో ప్రజలు మళ్లీ భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 24 వరకు అర్హుల నుంచి కొత్తగా 96,423 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అయితే వీటిలో అత్యధికంగా కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చినవే ఉన్నాయి. కాగా సర్కారు కేవలం 23,000 మందికి కొత్త రేషన్ కార్డులను జారీ చేసి చేతులు దులుపుకొందామనుకోగా ప్రజలు షాకిచ్చారు. లబ్ధిదారుల జాబితాలో కోత విధించడంపై అధికారులను నిలదీయడంతోపాటు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా అర్హుల నుంచి నిరసన వ్యక్తం కావడంతో మళ్లీ దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కాగా కొత్త రేషన్ కార్డుల కోసం 58,784 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి 26,312 రైతు భరోసా పథకానికి 3745, ఆత్మీయ భరోసా పథకానికి 7582 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

### కొత్త కార్డుల కోసం అధికారుల నిలదీత

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు లబ్ధిదారుల జాబితాలను ఎంపిక చేసేందుకు నిర్వహించిన గ్రామ, వార్డు సభలు నిరసనలు, నిలదీతల నడుమ ముగిశాయి. పై నాలుగు పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు సర్వే చేపట్టిన సమయంలోనే ప్రజలు సర్వే అధికారులను అడ్డుకోవడం, నిలదీయడంతో మొదలైన నిరసనలు చివరి రోజు వరకూ కొనసాగాయి. అయితే సర్వే సమయంలోనే వ్యతిరేకత రావడాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించింది. ప్రజాపాలన దరఖాస్తులు తప్పని సరేం కాదని ఆ సమయంలో చెప్పిన సర్కారు... ప్రస్తుతం పై నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ఆ అప్లికేషన్లకే ప్రాధాన్యమివ్వడంతో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రతి గ్రామంలోనూ ప్రజలు అధికారులను నిలదీశారు. కొత్త రేషన్ కార్డులకు వేలాది మంది అర్హులు దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుతం అవి కనిపించడంలేదని చెబుతుండడంతో ప్రజలు మండిపడుతున్నారు. కాగా ఆయా పథకాలకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిని ఎప్పుడు లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో అధికారులు ఏదో ఒక సమాధానం చెప్పి గ్రామసభలను ముగించారు.

తాండూరు రూరల్ : అంతారం గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు





బషీరాబాద్ గ్రామసభలో కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



బంట్వారం(కోట్‌పల్లి) : బార్వాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల విషయమై అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు



పరిగి : దరఖాస్తులు తీసుకోవడం తప్ప పథకాలు అందడం లేదని అధికారులను నిలదీస్తున్న పరిగి పదోవార్డువాసులు